క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి సన్మానం



ధనలక్ష్మిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ టీచర్ ధనలక్ష్మిని గురువారం శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్‌దాస్, కార్యదర్శి వనం విజయ్‌కుమార్, సభ్యులు శ్రీనునాయక్, భాస్కర్, గిరిజన బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి పద్మజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాదాలు వద్దు.. అభివృద్ధిపై దృష్టి పెట్టండి



పోలీసులతో మాట్లాడుతున్న కాలనీ వాసులు

తుర్కయంజాల్: వివాదాల జోలికి వెళ్లకుండా.. కాలనీ అభివృద్ధిపై దృష్టి సారించాలని వనస్థలిపురం సీఐ మహేశ్‌గౌడ్ అన్నారు. గురువారం సీఐ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ ఇందిరమ్మ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కాలనీలో జరుగుతున్న తగదాలపై ఇరు వర్గాలను ఒకే రకంగా చూడాల్సిన పోలీసులు.. ఒక వర్గానికి అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. వినాయక నిమజ్జన సమయంలో జరిగిన గొడవలో మహిళలు అని కూడా చూడకుండా ఒక వర్గానికి చెందిన వారిని తీవ్రంగా కొట్టారని విమర్శించారు. గొడవకు కారణమైన వారిని మాత్రం వదిలేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామని వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఐలయ్య, ఎస్‌ఐ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రాజీతో కక్షిదారులకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గంగాధర్

కడ్తాల్: రాజీయే రాజమార్గమని, సత్వర న్యాయం కోసం కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని సీఐ గంగాధర్ సూచించారు. ఈ నెల 10 నుంచి 13 వరకు జరుగుతున్న లోక్ అదాలత్ గురించి గురువారం ఠాణాలో నిర్వహించిన సమావేశంలో సిబ్బందితో మాట్లాడారు. ప్రతి వ్యక్తి జీవితంలో తెలిసో, తెలియకో చాలా తప్పులు జరుగుతుంటాయని, కేసులు నమోదు అవుతుంటాయని తెలిపారు. ఈ కేసులకు త్వరగా, ఖర్చులేకుండా పరిష్కరించుకునే వేదిక అదాలత్‌ని వివరించారు. ప్రజల మధ్య శాంతి, సఖ్యత నెలకొల్పడం కోసం న్యాయ వ్యవస్థలో ఒక వెలుగునిచ్చే దీపమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

బోధన ప్రమాణాలు భేష్..

ప్రొఫెసర్ పద్మ



విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పద్మ

అబ్దుల్లాపూర్‌మెట్: పాఠశాలలో బోధన ప్రమాణాలు, శిక్షణా పద్ధతులు కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసర్చ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ) న్యూఢిల్లీ ప్రొఫెసర్ పద్మ యాదవ్ అన్నారు. మండల పరిధి మజీద్‌పూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. 'ఏ స్టడీ ఆన్ ఎఫ్ఎల్ఎన్ ఇంటియేటివ్స్ ఇన్ ఇండియా' పర్యటనలో భాగంగా ఆమెతో పాటు ఎస్‌సీఈఆర్టీ ఫ్యాకల్టీ సభ్యుడు జె.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె.. పాఠశాలలో జరుగుతున్న ఫౌండేషనల్ లిటరసీ- న్యూమరసీ కార్యక్రమాన్ని సమీక్షించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కార్యక్రమం అమలు విధానాన్ని విశ్లేషించారు. టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం తల్లిదండ్రులతో సమావేశమై, ఉపాధ్యాయుల పట్ల వారి స్పందనలు, పాఠశాల అభివృద్ధి గురించి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జగదీశ్వర్, ప్రధానోపాధ్యాయుడు విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తరగతులు ఏడు.. టీచర్లు ముగ్గురు

విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయుల సమన్వయ లోపం.. చిన్నారులకు శాపంగా మారింది. వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యతను మరచి, ఆధిపత్య పోరును పోషించారు. తగాదాలతో తలో దిక్కు వెళ్లిపోయారు. ప్రస్తుతం బడిని పట్టించుకునే వారు లేరు! బోధన సరిగా ముందుకు సాగడం లేదు. వెరసి విద్యార్థుల భవితవ్యం ప్రశార్థకంగా మారింది.

ఉపాధ్యాయుల ఇష్టారాజ్యం
- అధికారుల జోక్యం.. నలుగురు బదిలీ
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు
- పిల్లల భవిష్యత్‌పై తల్లిదండ్రుల బెంగ
- ఇదీ కప్పపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి



కప్పపహాడ్ ప్రభుత్వ పాఠశాల

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామం యూపీఎస్.. విద్యా సంవత్సరం ప్రారంభంలో.. విద్యార్థులతో కళకళలాడేది. చిన్నారుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం.. (ఏడుగురు ఉపాధ్యాయులు) హిందీ పండిట్ స్కూల్ అసిస్టెంట్, ఆరుగురు ఎస్‌జీటీలను కేటాయించింది. ఒకటి నుంచి నుంచి ఏడవ తరగతి వరకు గతేడాది 90 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసించేవారు. ప్రస్తుత ఏడాది ప్రారంభంలో 70 మందికి పైగా ఉండేవారు. ఉపాధ్యాయుల ఇష్టారాజ్యం, తగాదాల నేపథ్యంలో క్రమంగా మూడు నెలల కాలంలోనే వారి సంఖ్య 56కు పడిపోయింది. దీంతో ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించారు. ప్రస్తుతం ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు.

కొరవడిన సమన్వయం

ప్రస్తుత ఏడాది జూన్ నెలలో ఏడుగురు ఉపాధ్యాయులు పని చేసేవారు. స్కూల్ అసిస్టెంట్ హిందీ పండిట్‌పై.. కొందరు గ్రామస్తులు ఆరోపణలు చేస్తూ.. విద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనను డిప్యూటేషన్‌పై ఆదిబట్లకు బదిలీ చేశారు. అనంతరం అక్కడ ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయుడి ఆధిపత్య పోరుతో పాఠశాల పరిస్థితి దిగజారి పోయింది. టీచర్ల మధ్య గొడవలు మొదలయ్యాయి. దీనిని గమనించిన విద్యాధికారులు.. (ముగ్గురు టీచర్లు) ఆనంద్ ఎస్‌జీటీని ఇబ్రహీంపట్నం బాలికల పాఠశాలకు, ఆంజనేయులు ఎంపీపీఎస్ శేరిగూడకు, మంజుల ఎస్‌జీటీ ఇబ్రహీంపట్నం పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో ఏడు తరగతులకు ప్రస్తుతం ముగ్గురు మహిళా ఉపాధ్యాయులే మిగిలారు. ఇదిలా ఉండగా.. పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధిపత్య పోరు పోలీసులకు ఫిర్యాదు రూపంలో వెళ్లిందంటే పరిస్థితి ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు.

విద్యార్థుల ప్రైవేటు బాట..

ఉపాధ్యాయుల తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. టీచర్ల లేక పాఠాలు చెప్పేవారు లేరని చిన్నారులు పేర్కొంటున్నారు. చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పెద్దలు వాపోతున్నారు. ఇక్కడి పరిస్థితుల నేపథ్యంలో వారి పిల్లలను పరిసర గ్రామాల సర్కారు బడి, లేదా స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. ఫలితంగా జూన్‌లో బడులు తెరిచిన నాటికి 70 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య.. ప్రస్తుతం 56కు పడిపోయింది.

పిల్లలు నష్టపోతున్నారు



ఉపాధ్యాయుల సమన్వయ లోపం. అధికారుల నిర్లక్ష్యంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. పాఠాలు సక్రమంగా చెప్పడం లేదు. దీని వలను విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. నా ముగ్గురు పిల్లలు ఇదే బడిలో చదువుతున్నారు. సమస్యను పరిష్కరించి, పాఠశాల పరిస్థితిని చక్కదిద్దండి.

– ప్రసాద్, కప్పపహాడ్

నాయకుల జోక్యం తగ్గాలి



టీచర్ల గొడవతో పిల్లల చదువు ఆగం అవుతోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను నియమించాలి. బోధన మెరుగు పర్చాలి. పాఠశాల విషయంలో నాయకుల జోక్యం తగ్గాలి. చిన్నారుల భవితను దృష్టిలో ఉంచుకొని మెసులుకోవాలి.

– మంజుల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్

సర్దుబాటు చేస్తాం



పాఠశాలలో నెలకొన్న సమస్యలపై తర్జనబర్జన పడుతున్నాము. ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లోపమే ఇందుకు కారణం. ప్రస్తుతం ముగ్గురు పనిచేస్తున్నారు. మరొకరిని పంపిస్తాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు చేస్తాం. సమస్యలు లేకుండా చూస్తాం.

– హీర్యానాయక్, మండల విద్యాధికారి

సమన్వయంతో పార్టీ బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

యాచారం: సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ అన్నారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీజీఐఐసీ ద్వారా రూ.కోట్ల నిధులు తెస్తూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తోందని, వాటిని ప్రజలకు వివరించి, స్థానిక ఎన్నికల్లో పార్టీ బలపర్చిన వారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీలు రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్ నాయక్, సుదర్శన్‌రెడ్డి, ముత్యాల వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై దృష్టి సారించాలి



వర్మీకంపోస్టు తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు

జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్

ఆమనగల్లు: విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్ అన్నారు. శంషాబాద్ మండలం గండిగూడ బాటి అగ్రి ఫార్మ్‌లో గురువారం ఆమనగల్లు ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఒకరోజు వ్యవసాయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సాగుపై అవగాహన కల్పించారు. సోలార్ డ్రాయర్ వ్యవసాయం, వర్మీకంపోస్ట్ నిర్వహణ, జెరినియం సాగు, మిశ్రమ పంటల సాగు తదితర వాటిపై వివరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత ఉపాధి కోసం ఇతర రంగాలతో పాటు వ్యవసాయ రంగం వైపు దృష్టి సారించాలని సూచించారు. ఈ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని, తద్వారా ఆర్థికంగా ఎదగవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఫార్మ్ నిర్వాహకులు రాజశేఖర్, వ్యవసాయ నిపుణులు బంకట్‌లాల్, పర్యావరణ పరిరక్షణ సమితి, చెట్టు అమ్మ సభ్యుడు వెంకట్, సాయి, నిఖిల్, శ్రీకాంత్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

'పట్నం'ను వీడని వర్షం

ఇబ్రహీంపట్నం: పట్నంలో జోరుగా వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం పన్నెండు గంటల తర్వాత మొదలై.. రాత్రి 7 గంటల వరకు దంచికొట్టింది. బుధవారం రెండు గంటల పాటు విరామం లేకుండా కురిసిన సంగతి తెలిసిందే. వారం రోజులుగా ఎండలు మండిన నేపథ్యంలో.. ప్రస్తుత వానలతో పట్టణ ప్రజలకు ఉపశమనం లభించింది.

వర్షపాతం వివరాలు

మంగల్‌పల్లిలో 56.3 మి.మీటర్లు, ఇబ్రహీంపట్నంలో 47.3 మి.మీ. కొంగరకలాన్‌లో 22.8 మి.మీ., ఎలిమినేడులో 33.3 మి.మీ., దండుమైలారంలో 30 మి.మీ. నమోదు అయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై జన సంచారం నిలిచిపోయింది.

యాచారంలో..

యాచారం: మండల కేంద్రం, పరిధి మల్కీజ్‌గూడ, గునుగల్, మాల్, నల్లవెల్లి, తక్కళ్లపల్లి, మొండిగౌరెల్లి తదితర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం గంట పాటు భారీ వర్షం పడింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మెట్ట పంటలకు జీవం పోసినట్లు అయింది.



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం- మంచాల రహదారిపై నిలిచిన నీరు

యూరియా కొరత తీర్చండి

మాడ్గుల: యూరియా కొరత లేకుండా చూడాలని సింగిల్ విండో డైరెక్టర్ కొప్పు జగన్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి కోరారు. గురువారం జిల్లా డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి ఉషకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారని, అవసరం మేర అందరికీ అందజేయాలని పేర్కొన్నారు. మండలానికి సరిపడా నిల్వలు ఉండే చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి ఆమె స్పందించి, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ పంపిణీ చేస్తామని చెప్పారు.

నేడు టీచర్లకు సత్కారం

ఆమనగల్లు: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేయనున్నామని క్లబ్ పీఆర్‌ఓ పాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొననున్నారని పేర్కొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

కడ్తాల్: ఊరు నిండా కన్నే.. ఊరంతా సీసీ కెమెరాలే కార్యక్రమంలో భాగంగా.. చరికొండలో కెమెరాల ఏర్పాటుకు అదే గ్రామానికి చెందిన మహేందర్‌గౌడ్ రూ.21 వేల విరాళం చెక్కును గురువారం సీఐ గంగాధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతను సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది సన్మానించారు. నేర నియంత్రణకు దోహదపడే సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వరప్రసాద్, చంద్రశేఖర్, ఏఎస్‌ఐ బాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, శివదత్త ఉన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మంచాల: రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి అన్నారు. గురువారం మంచాల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ ఎంవీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతే రాజు అంటున్న ప్రభుత్వం.. వారిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సకాలంలో యూరియా అందించక ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. అవసరం మేరకు రైతులకు.. ఎరువులను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, ఎల్లేష్, అంజయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు

పెద్దలను వదిలి.. పేదల పొలాల్లో రోడ్లా

- ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చండి
- రైతుల డిమాండ్

మాడ్గుల: వందల ఎకరాలు ఉన్న భూస్వాముల భూములను వదిలి.. చిన్న,సన్నకారు రైతుల పొలాల నుంచి రోడ్డు నిర్మించడం ఎంతవరకు సబబని బాధిత రైతులు ప్రశ్నించారు. వెంటనే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. గురువారం బ్రాహ్మణపల్లి, అన్నబోయిన్‌పల్లి గ్రామాల రైతులు మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల ప్రభుత్వం అని చెప్పుకొంటున్న ప్రజాప్రతినిధులు.. వారి భూములను ఎందుకు లాక్కుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలైన్‌మెంట్ మార్చి, అన్నదాతలకు న్యాయం చేయాలని కోరారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం



ఆమనగల్లు: టీడబ్ల్యూజేఎఫ్ మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

- వారి సమస్యల పరిష్కారానికి కృషి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన నగరంలోని తన నివాసంలో ఈ నెల 26న కందుకూరు మండల కేంద్రంలో నిర్వహించనున్న టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా 3వ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుధాకర్, యూనియన్ జిల్లా నాయకుడు చంద్రశేఖర్, బ్లాక్ సమన్వయ కమిటీ అధ్యక్షుడు యూనుస్, బ్లాక్ అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు. కాగా.. ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూలురు కమలమ్మను ఎమ్మెల్యే పరామర్శించారు.

పల్లెచెలకతండా అభివృద్ధికి రూ.కోటి

కడ్తాల్: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీజీఐఐసీ) నుంచి పల్లెచెలకతండా అభివృద్ధికి రూ.1 కోటి నిధులు మంజూరయ్యాయని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు రమేశ్‌నాయక్ తెలిపారు. గురువారం ఎమ్మెల్యేను నగరంలోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. మొదటి విడతగా ప్రస్తుత నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే మరో రూ.3 కోట్లు కేటాయిస్తానని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల హామీ ఇచ్చారని పేర్కొన్నారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, బీచ్యానాయక్, వెంకటేశ్, వేణుగోపాల్, నర్సింహనాయక్, శ్రీనునాయక్, దీప్లా, సీతారం ఉన్నారు.

బంజారాలపై చిన్నచూపు తగదు

- స్థానిక ఎన్నికల్లో సత్తాచూపుతాం
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్



నూతన సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: 'బంజారా బిడ్డలు ఎవరికీ తక్కువ కాదు. వారిని చిన్నచూపు చూస్తున్న వారికి రానున్న స్థానిక ఎన్నికల్లో మా సత్తా ఏమిటో చూపిస్తాము' అని లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. తన రాజకీయ ఎదుగలను చూసి కొంత మంది ఓర్వలేకపోతున్నారని, అలాంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమితి కమిటీల నియామకాలను పూర్తి చేసి, నియోజకవర్గ వ్యాప్తంగా త్వరలో 20 వేల మంది బంజారాలతో బంజారాభేరి భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమితి కార్యకర్తల సమావేశంలో పలు తండాలకు అధ్యక్షులను నియమించారు. సమితి మైసిగండి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రామవత్ ప్రవీణ్‌కుమార్, గానుగుమార్లతండా అధ్యక్షుడిగా కిషన్‌నాయక్, పెద్దవేములోని బావితండా అధ్యక్షుడిగా కొర్ర శ్రీనునాయక్, గడ్డమీదితండా అధ్యక్షుడిగా శ్రీను నాయక్‌లను నియమించారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తులసీరాం, భూనాథ్, సేవ్యా, పాండు, రమణ, శ్రీను, లక్ష్మణ్, మోతీలాల్, రాజు, జగన్, తేజు, హరి, రాజశేఖర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

'హైటెన్షన్'తో నష్టపోతున్నాం..



దీక్షకు సంఘీభావం తెలిపిన నాయకులు


విద్యుత్ లైన్ మార్చండి: రైతులు

కడ్తాల్: వ్యవసాయ పొలాల మీదుగా 765 కేవీ బీదర్- మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు వలన చిన్నసన్నకారు రైతులం నష్టపోతున్నామని, వెంటనే అలైన్‌మెంట్‌ను మార్చాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో వారు చేపట్టిన దీక్ష గురువారానికి నాలుగో రోజుకు చేరింది. దీక్షలో రావిచేడ్ చెందిన అంజయ్య, జనార్దన్, అబ్దుల్ నదీమ్, రాములు, పవన్‌కల్యాణ్, రవీందర్ తదితరులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, రైతులు మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ మార్చే వరకు ఉద్యమం ఆపేది లేదని స్పష్టం చేశారు. దీక్షకు రైతుసంఘం నాయకులు రామకృష్ణ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి సంఘీభావం తెలిపారు.

గోడ కూలి రెండు గొర్రెలు, దూడ మృతి

యాచారం: భారీ వర్షం వలన ఓ వెంచర్ ప్రహరీ కూలి రెండు గొర్లు, ఒక దూడ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి గునుగల్ గ్రామానికి చెందిన ఆవ అయిలయ్య.. గురువారం మధ్యాహ్నం వర్షం పడుతున్న నేపథ్యంలో తన పాడి పశువులు, గొర్రెలను తన వ్యవసాయ పొలం పక్కనే ఉన్న ఓ వెంచర్ ప్రహరి పక్కనే కట్టేశాడు. ఈ క్రమంలో గోడ కూలి, మట్టి పెల్లల కింద మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. సమాచారం మేరకు మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి సంఘటనా పరిశీలించి, బాధిత రైతును పరామర్శించారు. తహసీల్దార్ అయ్యప్పకు ఘటన గురించి వివరించి, అయిలయ్యను ఆదుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు



ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసిన ఎంఈఓ

ఎంఈఓ సర్దార్ నాయక్

మాడ్గుల: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలమైందని, వారే సమాజ నిర్మాతలని మండల విద్యాధికారి సర్దార్ నాయక్ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి చిత్రపటానికి ఎంఈఓ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వేపల్లి జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మానించారు. ప్రశంసాపత్రాలు అందజేశారు. టీచర్ల కృషితోనే సమాజంలో మార్పు సాధ్యమని పేర్కొన్నారు.